

12న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు అర్బన్:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకూ 7,712 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామని తెలిపారు. ఈనెల 12వ తేదీన నిర్వహించే అదాలత్ నిమిత్తం జిల్లావ్యాప్తంగా 32 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్, కుటుంబ తగాదా, వాహన ప్రమాద, చెక్ బౌన్స్ కేసులు, రాజీయోగ్యమైన అన్ని కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. అలాగే ప్రతీరోజు (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్) కేసులకు సంబంధించి ప్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో నిర్వహిస్తున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సందేహాలుంటే 0881 2 24555 ఫోన్ నెంబర్కు సంప్రదించాలని కోరారు.

'ఆరోగ్యశ్రీ'లోనూ దోపిడీ..!

రూ.వెయ్యి ఖర్చు దాటితే ఆరోగ్యశ్రీ అంటున్న ప్రభుత్వం
ఎక్కడా అమలు కాని ప్రభుత్వ నిబంధనలు
ఆరోగ్యశ్రీ వర్తించినా కనీసంగా రూ.50 వేలు బాదుడు
ప్రశ్నిస్తే వేరే ఆసుపత్రికి వెళ్లాలంటూ హుంకరింపులు
గత్యంతరం లేక అప్పు చేసి వైద్యం చేయించుకుంటున్న పేదలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మెట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురవ్వడంతో దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్తే అన్ని పరీక్షలూ చేసి ఆపరేషన్ చేయాలన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ కూడా మళ్లీ అన్ని టెస్టులూ చేసి రూ.25 వేలు ఖర్చు పెట్టించి ఆపరేషన్ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీలో వచ్చే సొమ్ము సంపాదని, రాడ్లు వేయడానికి అదనంగా సొమ్ము ఖర్చవుతుందని చెప్పడంతో వారికి ఏం చేయాలో అర్థంకాక అప్పు చేసి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.'

'తణుకు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు నెలలు తక్కువతో బిడ్డ జన్మించాడు. ఇంక్యుబేటర్‌లో (బాక్సు) పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ పెట్టకుండా రోజుకు రూ.20 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది.'

పైన పేర్కొన్న ఘటనలు మచ్చుకు మాత్రమే. అనారోగ్యంతో ఆరోగ్యశ్రీ కార్డులతో ఆసుపత్రులకు వెళ్తున్న రోగుల నుంచి కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రులు విచ్చలవిడిగా దోచేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పెద్దఎత్తున ఆరోగ్యశ్రీకి ఖర్చు పెడుతున్నప్పటికీ పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీలో జరుగుతున్న తంతును ఒకసారి గమనిస్తే ఆసుపత్రి యాజమాన్యాలు ఏవిధంగా దోచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. తీవ్రమైన ఆరోగ్య సమస్యతో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రోగులు వెళ్తున్నారు. ఓపి చీటీ తీసుకుని వైద్యునికి చూపించుకుంటున్నారు. రక్త పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ ఇలా అనేక పరీక్షలు చేస్తున్నారు. ఆసుపత్రిని బట్టి దాదాపు రూ.పది వేల నుంచి రూ.20 వేలు వరకూ గుంజుతున్నారు. తర్వాత ఆపరేషన్ పడుతుందని చెప్పి ఆరోగ్యశ్రీలో పెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ వర్తించాలంటే అప్పటి వరకూ రోగికి చేసిన పరీక్షల రిపోర్టులు, స్కానింగ్‌లకు సంబంధించిన రిపోర్టులను అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించాక ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తారు. ఆరోగ్యశ్రీ అప్రూవల్ అయిన తర్వాత తొలుత చేసిన టెస్టు రిపోర్టులకు సంబంధించిన సొమ్ము సైతం సదరు ఆసుపత్రికి వస్తోంది. నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ వర్తింపచేసిన తర్వాత ముందుగా టెస్టుల పేరుతో ఖర్చు చేసిన సొమ్మును ఆసుపత్రి యాజమాన్యం రోగికి వెనుకకు ఇవ్వాలి. ఏఒక్క ఆసుపత్రిలోనూ ఇది జరగడం లేదు. అంతేకాకుండా టెస్టులు చేసిన తర్వాత వెంటనే ఆపరేషన్ చేయకుండా నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలని చెప్పి రూ.50 వేలు వరకూ లాగేస్తున్నారు. తర్వాత ఆరోగ్యశ్రీలో ఆన్‌లైన్ చేసి ఆపరేషన్ చేస్తున్నారు. రోజులు నిండకుండా, శ్వాస వంటి సమస్యలతో పుట్టిన పసికందులను ఇంక్యుబేటర్‌లో పెట్టేందుకు ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ఎక్కడా అది అమలు కావడం లేదు. నాలుగైదు రోజులు సొమ్ము తీసుకుని తర్వాత ఇంక్యుబేటర్‌లో పెడుతున్నారు. మొదట నాలుగు రోజులకు రోజుకు రూ.20 వేలు చొప్పున రూ.లక్ష వరకూ దోచేస్తున్నారు. కిడ్నీ, గుండె వంటి సమస్యల్లో ఏఒక్క అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా ఇదే పరిస్థితి. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ కనీసంగా రూ.40 వేలకుపైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ముందుగా చేసిన టెస్టులకు సొమ్ము రాదని చెబుతున్నారు. దీనిపై రోగులకుగానీ, వారి కుటుంబ సభ్యులకుగానీ అవగాహన ఉండటం లేదు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే వేరే ఆసుపత్రికి తీసుకుపోమంటూ ఆసుపత్రి యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే అనారోగ్యంతో ఉన్న తమవారికి ఏమైనా అవుతుందేమోనన్న భయం కుటుంబ సభ్యులను వెంటాడుతోంది. అంతేకాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని ఆసుపత్రుల చుట్టూ తిప్పలేక మౌనంగా ఉండిపోతున్నారు. ఎముకలకు సంబంధించిన ఆపరేషన్ జరిగితే ఆరోగ్యశ్రీలో రాడ్లు బాగోవని, అదనంగా మరో రూ.30 వేలు, రూ.40 వేల వరకూ ఖర్చు చేయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఫలాలు పేదలకు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

అవగాహన కల్పించడంలో ఆరోగ్యమిత్రలు విఫలం

ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి ఆవరణలో ఆరోగ్యమిత్ర ఉంటారు. ఆరోగ్యశ్రీ వర్తించాలంటే వారే ఆన్‌లైన్ చేయాలి. అక్కడ జరుగుతున్న తంతు అంతా వారికి తెలిసినప్పటికీ రోగులకుగానీ, వారి బంధువులకుగానీ అవగాహన కల్పించడంలో ఆరోగ్యమిత్రలు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి వద్దకు వెళ్లి సొమ్ము ఏమైనా ఖర్చు పెట్టారా.. యాజమాన్యం మీకు తిరిగిచ్చిందా.. అని అడిగే దాఖలాల్లేవు. ఒకవేళ జరిగినా అది తూతూమంత్రంగానే తప్ప రోగికి న్యాయం చేసేలా ఉండటం లేదు. ముందుగా చేసిన టెస్టుల సొమ్ము యాజమాన్యం తిరిగివ్వాలని, ఆవిధంగా ఏమైనా ఖర్చు చేశారా అని కూడా అడగని పరిస్థితి నెలకొంది. గతంలో ఆరోగ్యమిత్ర కేబిన్‌ల వద్ద వారి ఫోన్ నెంబర్లు బోర్డుపై రాసి పెట్టేవారు. చాలాచోట్ల ఇప్పుడు ఆ ఫోన్‌నెంబర్లు అనేవి లేవు. ఒకవేళ అడిగినా ఇవ్వని పరిస్థితి ఉంది. ఆరోగ్యశ్రీ నిబంధనలను ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆరోగ్యమిత్రలు అవగాహన కల్పిస్తే సామాన్య ప్రజానీకానికి మరింత ప్రయోజనం చేకూరుతోంది.

ఆరోగ్యశ్రీలో ఉచితంగానే వైద్యం

టి.ఆంథోని ఆల్బర్ట్‌లూయిస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

ఆరోగ్యశ్రీలో చేరిన రోగులకు ఉచితంగానే వైద్యం ప్రభుత్వం అందిస్తోంది. ఎటువంటి సొమ్మూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఏమైనా అనుమానాలు ఉంటే ఆరోగ్యమిత్రను కలిస్తే వివరాలు చెబుతారు. ఆరోగ్యశ్రీ ఆమోదమైన తర్వాత ముందుగా చేసిన టెస్టుల సొమ్ము కూడా రోగికి చెల్లించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీలో చేరిన తర్వాత కూడా డబ్బు వసూలు చేస్తే ఫిర్యాదు ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

పట్టుదలతో శ్రమిస్తే విజయం : కలెక్టర్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పట్టుదలతో శ్రమిస్తే విజయం వరిస్తుందని, పోలీసు ఉద్యోగం పొందాలని కసితో కృషి చేస్తే తప్పనిసరిగా పొందొచ్చని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'గిరి నేస్తం' కార్యక్రమం ద్వారా రెండు నెలల పాటు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద గల యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకున్నది ఏదీ కష్టపడకుండా దొరకదన్నారు. ఒక కుటుంబంలోని పేదరికం పోవాలంటే కనీసం ఒకరు కష్టపడి ఉద్యోగం సాధించాలన్నారు. ఇష్టంగా మనస్సు పెట్టి శిక్షణ పొందితే ఉద్యోగం ఖచ్చితంగా వస్తుందన్నారు. నిర్మాణ రంగం, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ వంటి రంగంలో మానవనరులకు మంచి డిమాండ్ ఉందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు తాడువాయిలో పునరావాస కాలనీలు నిర్మిస్తున్నామని, తమ సొంత ప్రాంతం నుండి ఉపాధి కోల్పోయి పునరావాస కాలనీలకు చేరుకునే గిరిజన యువతకు వారికి అభిరుచి కలిగిన రంగంలో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించే ందుకు ఆ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను నెలకొల్పుతామన్నారు. ఉద్యోగం వచ్చిన వారు ఏ ప్రాంతంలోనైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, పౌరహక్కులకు భంగం కలగకుండా పోలీసు శాఖ ప్రజలతో మమేకమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీస్, భద్రత దళాల విభాగాల్లో 23 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వీటిలో రాష్ట్రంలో 6100 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. వీటిలో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేందుకు 'గిరి నేస్తం' ద్వారా 88 మంది గిరిజన యువతకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.అరుణ్‌బాబు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.ఝాన్సీరాణి, పోలవరం డిఎస్‌పి లతాకుమారి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి

చీదరింపులు... చీత్కారాలు..?

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో రోగుల పట్ల సిబ్బంది దురుసు ప్రవర్తన

ఎక్సరే వార్డులో ఇదీ తీరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రోగుల పట్ల సహనంతో మెలగండి.. వారిని ప్రేమగా పలకరించండి.. వారి సమస్య తెలుసుకుని పరిష్కరించండి.. ఇదీ ఏలూరులోని ప్రభుత్వాసుపత్రి అధికారులు ప్రతీరోజు సిబ్బందికి చెప్పే మాటలు.. కానీ ఆచరణలో మాత్రం అవి నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల కొందరు సిబ్బంది అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. దీనికి ఎక్స్ రే వార్డు ఉదాహరణగా నిలుస్తోంది. శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్స్ రే తీయించుకునేందుకు వచ్చారు. వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాల్సిన ఎక్స్ రే వార్డులోని కొందరు సిబ్బంది వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం రోగులను విస్మయానికి గురిచేసింది. రోగులపై పెద్ద పెద్దగా అరవడంతోపాటు వారిని చిన్న బుచ్చేలా మాటలతో వ్యవహరించారని పలువురు రోగులు వాపోయారు. వారికి తెలిసిన వారిని మాత్రం క్యూలైన్ అవసరం లేకుండానే ఎక్స్ రేలు తీశారని తమను మాత్రం గంటలకొద్దీ ఎక్స్ రే వార్డు దగ్గర పడిగాపులు పడేలా చేశారని పలువురు వాపోయారు. సాక్షాత్తు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఒ కార్యాలయాల సమీపంలోనే ఉన్న ఎక్స్ రే వార్డు వద్ద పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన వార్డుల్లో పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వారి సహాయకుల పట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని పలువురు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత లోపిస్తే చర్యలు : జెసి

బుట్టాయగూడెం:మధ్యాహ్న భోజనం నాణ్యతలో లోపాలుంటే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలో సుడిగాలి పర్యటన చేసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ముంజులూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం వండుతున్న వంట గదిని, అక్కడి పరిసరాలను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న కోడిగుడ్లను వారం చివరలో మిగిలిన గుడ్లతో ఎగ్‌బుర్జి చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. అనంతరం పులిరామన్నగూడెంలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల జాబితాను తప్పనిసరిగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, స్పందన ద్వారా అందిన దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖల వారికి అదేరోజు పంపాలని సూచించారు. వాటి పరిష్కార విధానాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. అనంతరం అదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. సరైన రహదారి సౌకర్యం లేని కొండ ప్రాంతాల్లోని గిరిజనులకు బైక్ అంబులెన్సు ద్వారా అందుతున్న సేవలను, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం బుట్టాయగూడెంలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను జెసి ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్, ఎంపిడిఒ, వైద్య శాఖ సిబ్బంది ఉన్నారు.

వచ్చే నెలాఖరుకు పునరావాస కాలనీలు పూర్తిచేయాలి

బుట్టాయగూడెం:ఇంకా పూర్తికాని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలను వచ్చే నెలాఖరుకు ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తిచేసి, నిర్వాసితులకు కొత్త గృహాలకు తరలించాల్సిందేనని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ స్పష్టం చేశారు. స్థానిక ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో జెసి, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ అధికారితో కలిసి పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాస కాలనీ నిర్మాణ పనులపై శనివారం అధికారులతో, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ నిర్వాసితులకు పునరావాస కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అందించి కాలనీలకు తరలిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని, ఆ మేరకు పనులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వేలేరుపాడు, రేపాకగొమ్ము నిర్వాసితులకు నిర్మించిన పునరావాస కాలనీలు పూర్తయ్యాయని, వారిని త్వరితగతిన కాలనీలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల కోసం తాడువాయిలో నిర్మిస్తున్న పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగడంపై సంబంధిత కాంట్రాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడువాయి కాలనీలో ఇంకా ప్రారంభంకాని ఇళ్ల నిర్మాణ పనులను నూరు శాతం వెంటనే ప్రారంభించి, డిసెంబర్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి, నిర్వాసితులు నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలి

చింతలపూడి:కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధుల కేటాయింపును కుదించి, నిర్వీర్యం చేస్తోందని, అంగన్‌వాడీలపై పనిభారం పెరుగుతోందని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి పట్టణంలోని యూనియన్ ఆరో మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సూపర్‌వైజర్స్‌గా ఉద్యోగోన్నతులు న్యాయబద్ధంగా తక్షణం కల్పించాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ చింతలపూడి ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సరోజని, టి.మాణిక్యం, ఉపాధ్యక్షులుగా బి.ఫణివర్ధని, జాయింట్ సెక్రటరీగా సిహెచ్.విజయలక్ష్మి, కోశాధికారిగా జె.పద్మ, కమిటీ సభ్యులుగా వి.ఈశ్వరి, జి.సరళ, బి.అంజలి, పుష్పరాజ్యం, ఝాన్సీ, ఎస్.చినవరాలమ్మ, ఎం.సత్యవతి, పాపారత్నం, సరళ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, అంగన్‌వాడి యూనియన్ పూర్వపు అధ్యక్ష, కార్యదర్శుల మరియమ్మ, బిజెఎన్.కుమారి పాల్గొన్నారు.

చట్టప్రకారం జ్యూట్ కార్మికులకు పరిహారమివ్వాలి

ఏలూరు:మూసివేసిన శ్రీకృష్ణ జ్యూట్ మిల్లును తెరిపించాలని, తెరవని పక్షంలో చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన, నష్ట పరిహారం ఇప్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శనివారం పవర్‌పేటలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశం, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ ఏలూరులో స్వాతంత్ర్య పూర్వం నుండి నడుస్తున్న ఈ జ్యూట్ మిల్లును 2022 జనవరి 27వ తేదీన కార్మికులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా యాజమాన్యం మూసివేసిందని గుర్తు చేశారు. అప్పటి నుండి మిల్లులోని కార్మిక సంఘాలు వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తొమ్మిది నెలలైనా, మిల్లును తెరవడం గానీ, తెరవని పక్షంలో మిల్లులో పనిచేస్తున్న కార్మికులందరికీ చట్ట ప్రకారం నష్టపరిహారాలు గాని చెల్లించకపోవడం చట్ట వ్యతిరేక చర్య అని అన్నారు. ముందస్తు సమాచారం లేకుండా మిల్లు మూయిడాన్ని బట్టిమిల్లి యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని జ్యూట్ మిల్లు మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్న మూడు వేల కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కోసం కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు సిపిఎం మద్దతుగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు పాల్గొన్నారు

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి : కమిషనర్

ఏలూరు టౌన్:ప్రభుత్వం అందించే సేవలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలకు అందించి అవినీతి రహిత సమాజం కోసం ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని కమిషనర్ షేక్ షాహిద్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎసిబి అధికారులు విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ సామాన్య ప్రజానీకానికి నిష్పక్షపాతంగా ప్రభుత్వ సేవలను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విప్లవాత్మకమైన పరిపాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. గత నెల 31వ తేదీ నుంచి ఈనెల ఆరో తేదీ వరకూ అవినీతి వ్యతిరేక వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు.

అక్రమ చేపల చెరువులను తొలగించాలి : వ్యకాస

టి.నరసాపురం : తిరుమలదేవిపేట పంచాయతీ పరిధిలోని మల్లప్పగూడెం గ్రామంలో అక్రమ చేపల చెరువులను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం చెరువులను వ్యకాస నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలను పాడుచేసి చేపల చెరువులు యథేచ్ఛగా తవ్వకాలు చేసి చేపలు పెంచుతున్నారని అన్నారు. గ్రామచేపల చెరువులో చేపలకు మేత బదులు కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను వేస్తున్నారని తద్వారా దుర్వాసన వస్తుందన్నారు. వాటివల్ల తిన్నవారు అనారోగ్యాలకు గురవుతారని ఆందోలన వ్యక్తం చేశారు. వ్యర్థాలు వేయొద్దని చుట్టుపక్కల ఉన్న స్థానిక గిరిజనులు చిన్న సన్నకార రైతులు అనేకసార్లు చేపల చెరువు యాజమాన్యానికి తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం నాయకులు మడకం సుధారాణి, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్న సూరిరావు, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

7 నుంచి ఆపద మిత్రలకు శిక్షణ తరగతులు

జెడ్‌పి సిఇఒ రవి కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏ నెల ఏడో తేదీ నుంచి 18 వరకూ 12 రోజుల పాటు యలమంచిలి, అచంట, నరసాపురం, ఆకివీడు, పెంటపాడు మండలాలకు సంబంధించిన వంద మంది ఆపదమిత్ర వాలంటీర్లకు ఏలూరులోని సోషల్ సర్వీస్ సొసైటీ ట్రైనింగ్ సెంటర్‌లో రెసిడెన్సియల్ పద్ధతిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కెవిఎస్ఆర్.రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విపత్తుల వల్ల కలిగేనష్టాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో ఆపదమిత్ర వాలంటీర్లను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని తెలిపారు. జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలు విపత్తుల ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల ప్రజలకు తగిన ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ఈ తరగతులు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. విపత్తుల వల్ల ప్రాణ నష్టంతో పాటు వ్యవసాయం, ఆస్తి, పశు నష్టం, పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతినడం వంటి అనేకనష్టాల వాటిల్లడం సహజంగా జరుగుతుందన్నారు. జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళాలు దూరంగా ఉన్నందున విపత్తులు జరిగే ప్రాంతాలకు చేరుకోవడానికి సమయం పడుతుందని ఈలోపు స్థానికంగా అందుబాటులో ఉన్న ఆపదమిత్ర వాలంటీర్లు విపత్తుల సంభవించే ప్రాంతాలకు చేరుకుని ప్రజలను అప్రమత్తం చేయటంలో, ప్రజలను రక్షించే పనుల్లో ఉంటారని తెలిపారు. ఆపదమిత్ర వాలంటీర్లు ప్రజలకు సమీపంలో ఉంటారని అందువల్ల విపత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించడం కోసం క్షేత్రస్థాయిలో ప్రజాబలగాలను తయారు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాయని రవి కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి 12 రోజులు శిక్షణాతరగతులను నిర్వహిస్తుందని తెలిపారు. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం, జీవనోపాధి, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక, బౌతిక, పర్యావరణం వంటి నష్టాలను తగ్గించుకునేందుకు గ్రామ స్థాయిలోని ప్రజల నుండే నైపుణ్యం గల బలగాలను సిద్ధం చేయడమే ఆపదమిత్ర శిక్షణ ఉద్దేశమని పేర్కొన్నారు. వరదలు, తుపాన్లు, కరువు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు వంటి పెనువిపత్తులపై సరైన అవగాహన, అవసరమైన జ్ఞానం శిక్షణ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ద్వారా నేర్పిస్తామని పేర్కొన్నారు.

వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌర సరఫరాల శాఖ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మేనేజర్లు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన 'ధాన్యం కొనండయ్యా' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇ-క్రాప్, ఇకెవైసి డేటాను సేకరించేందుకు ప్రధాన కార్యాలయం నుంచి తగిన ఉత్తర్వులు ఇంకా జారీ కాలేదన్నారు. మరో వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, గ్రామస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసే సిబ్బందికి, వాలంటీర్లకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల వద్ద నుండి నాణ్యతా ప్రమాణాలకు (ఎఫ్ఎక్యూ) లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో తుఫాన్ల వల్ల ధాన్యం దెబ్బతింటే మాత్రమే ప్రభుత్వం తడిచిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

న్యాయం చేయాలని మహిళా కమిషన్‌కు వినతి

ముదినేపల్లి :అగ్రకులస్తుల దాడిలో గాయపడిన దళిత మహిళకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మను పలువురు కలిసి వినతిపత్రం అందచేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొవ్వా సత్యవతి ఇటీవల అగ్రకులస్తుల దాడిలో తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి చేరింది. అయితే వికలాంగురాలైన సత్యవతిపై దాడిచేసి గాయపరచారని, ఆమెకు తగు న్యాయం చేయాలని కోరుతూ అమరావతినిలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మను జై ఆంధ్ర సమాచార హక్కు చట్టం కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ దాడిలో ఎంతటి వారైనా వదిలే ప్రసక్తేలేదని, దళిత మహిళకు తగు న్యాయం చేస్తామని పద్మ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు బాపట్ల సుధీర్, మొవ్వ ఫణీంద్ర, పిల్లి గంగాధర్ తెలిపారు.

కాటేస్తున్నా.. కదలిక లేదే..!

అనంతపురం తరహాలో మెట్టలో తరచూ విద్యుత్ ప్రమాదాలు -బాలికలను చిదిమేస్తున్న పరిచయస్తులు



విద్యుత్ తీగలు కూలీల ప్రాణాలను కబళిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో విద్యుత్ తీగలు తెగిపడి కూలీలు మరణించిన ఘటన జిల్లాలో మెట్టప్రాంతంలో తరచూ చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. అలాగే స్కూళ్లకు వెళ్తున్న బాలికలపై కన్నేసిన పరిచయస్తులే కామాంధులై కాటేస్తుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది.

జంగారెడ్డిగూడెం మండలంలో ఉదయమే పాలు కోసం పొలం వద్ద ఉన్న పశువుల శాల వద్దకు మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు అన్నదమ్ములు మార్గమధ్యంలో తెగిపడి ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగల వల్ల ప్రమాదానికి గురై సజీవ దహనమయ్యారు. ఇటీవల లింగపాలెం మండలంలో ఆయిల్‌పామ్ తోటల్లో గెలలు కోస్తుండగా అటువైపుగా వెళ్లిన విద్యుత్ తీగల వల్ల కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ తరహా ఘటనలు చింతలపూడి, పెదవేగి, ద్వారకాతిరుమల, కామవరపుకోట తదితర మండలాల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో మృతులు సామాన్య కూలీలు కావడంతో ఎలాంటి పరిహారమూ దక్కడం లేదు. పామాయిల్ కార్మిక సంఘం జోక్యం చేసుకున్న చోట కొద్దోగొప్పో పరిహారం అందుతుంది. ఈ ప్రమాదాలతో ఆయా కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నాయి. అదే సమయంలో ఈ ప్రమాదాల నివారణకు ఇటు ప్రభుత్వం, అటు విద్యుత్ శాఖ నుంచి నిర్దిష్ట కార్యాచరణ కానరావడం లేదు. ఇటీవల విద్యుత్ శాఖాధికారులు ఆయిల్‌పామ్ గెలలు కోసేటప్పుడు తమకు సమాచారం అందిస్తే అటువైపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే ఆ సమాచారం ఎవరిస్తారు.. ఎవరు బాధ్యత వహిస్తారనేది స్పష్టత లేదు. దీనికి సంబంధించి రైతు, ఆ ప్రాంత ట్రాన్స్‌కో ఎఇ బాధ్యత వహించాల్సి ఉంటుంది. లైన్‌మెన్లే సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి లైన్లు బాగుచేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయ్యి పలువురు, ప్రయివేటు వ్యక్తులు మరణిస్తున్న ఘటనలు కోకొల్లలు. ఆయా సందర్భాల్లో విద్యుత్‌శాఖలో భాగమైన జూనియర్ లైన్‌మెన్ల కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతున్నా ప్రయివేటు సిబ్బంది కుటుంబాలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆయిల్ పామ్ గెలలు కోసే కార్మికుల ప్రాణాలకు ఎవరూ బాధ్యత పడతారనేది స్పష్టత రావాల్సి ఉంది. ఆయిల్‌పామ్ గెలలు కోసేటప్పుడు ఆ ప్రాంతంలో విద్యుత్ తీగలున్నా ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ కవచాలు రైతు సమకూర్చాల్సి ఉంది. అదే సమయంలో విద్యుత్ లైన్ల ప్రాంతంలో పామాయిల్ చెట్లు ఆ స్థాయిలో పెరిగి ఉంటే దాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది గుర్తించి ఆయా రైతులను హెచ్చరిస్తే ముందుగానే జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు ఒకవేళ అనూహ్య రీతిలో ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణనష్టం చోటుచేసుకుంటే కార్మిక కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం ఒక విధానం ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఓపక్క పామాయిల్ రైతుల సమస్యలను పట్టించుకోకుండా.. మరోపక్క పామాయిల్ గెలలు కోసే కార్మికుల ప్రాణాలను గాలికొదిలేసేలా ప్రభుత్వ విధానాలు ఉండటంపై అంతా పెదవి విరుస్తున్నారు. పామాయిల్ రైతుల, కార్మికుల కష్టాలు గట్టెక్కేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

కాటేస్తున్న కామాంధులు

జిల్లాలో వరుసగా పోక్సో కేసులు నమోదవుతుండటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. తణుకు, వీరవాసరం మండలాల్లో ఇటీవల రెండు పోక్సో కేసుల్లో బాలికలపై అఘాయిత్యానికి పాల్పడింది పరిచయస్తులే కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. నిర్భయ, దిశ చట్టాలు వంటివెన్ని ఉన్నా మహిళలపై అఘాయిత్యాలకు అడ్డూఅదుపు లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్న పాలకులు అఘాయిత్యాలకు కారణమవుతుండగా వీటిని ప్రేరేపిస్తున్న అంశాలపై దృష్టి పెట్టలేకపోవడం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. యువతను ప్రభావితం చేసి పక్కదోవ పట్టించే అశ్లీల అంశాలను నియంత్రించే వ్యవస్థ నేటికీ లేకపోవడం బాధాకరం. దీనికితోడు కేసులు నమోదైనప్పుడు త్వరితగతిన విచారించి నేరస్తులకు కఠిన శిక్ష పడేలా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించకపోవడం కామాంధుల స్వైరవిహారానికి కారణమవుతోందని స్పష్టమవుతోంది. చట్టాల పేర్లు చెప్పి ప్రచారం మాని వాటిని కట్టుదిట్టంగా అమలు చేయడంతోపాటు అఘాయిత్యాలను ప్రేరేపించే మాధ్యమాలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అప్పుడే మన కనురెప్పలైన బాలికలను, మహిళలను కామాంధుల నుంచి రక్షించుకోగలమని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. లేనిపక్షంలో కాటేసే కామాంధులకు ప్రభుత్వం పరోక్షంగా మద్దతు పలుకుతున్నట్లేనని భావించక తప్పదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

క్రీడా పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుట్టాయగూడెంలో శనివారం నిర్వహించారు. ఈ ఎంపికలకు కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, మండలాల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాదేవి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎ.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

గొడౌన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - దెందులూరు

మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, మేదినరావుపాలెం గ్రామాల్లో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రెండు 500 మెట్రిక్ టన్నుల గోడౌన్లను, మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎబిఎవి.లక్ష్మి, తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయానికి దాతలు రూ.1,01,116 విరాళం అందించారని ఆలయ ఛైర్మన్ దాట్ల రాజా సత్యనారాయణ తెలిపారు. శనివారం దాతలు అల్లూరి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు ఆలయ అభివృద్ధికి అల్లూరి రామారావు సీతారత్నం దంపతుల జ్ఞాపకార్థం రూ 1,01,116 విరాళంగా అందించారని చెప్పారు.

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా కోరారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల గోడపత్రికలను, కరపత్రాలను భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు హాజరు య్యారు. గ్రంథాలయ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు విద్యార్థులు, యువతకు అవసరమైన వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమా మహేశ్వరావు మాట్లాడుతూ స్థానిక గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

కుల, మత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేవుడు మన్యం గ్రామంలో డ్రైనేజీ సమస్య గురించి కొందరు యువకులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటెన్సివ్ అవగాహన-2022 కార్యక్రమంలో గ్రామ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిడమర్రు గ్రామ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆర్.శ్రీనివాసబాబు మాట్లాడుతూ బ్యాంకింగ్ అంబుడ్స్ మన్ స్కీమ్ గురించి, స్కీమ్ నేరాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ విస్తరణ అధికారి చంద్రశేఖర్ ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రాజశ్రీ, చిననిండ్రకొలను సెంట్రల్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ నిర్మాణ పనులను తిరుమల తిరుపతి దేవస్థానం ఎఇఇ కె.దొరస్వామి శనివారం పరిశీలించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గోపిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గుమ్మడి శేషాచార్యులు, ఆదవ సత్తిబాబు కొల్లూరు గణేష్ మారిశెట్టి శ్రీను, శ్రీనివాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా అశోక్ గౌడ్ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి రాష్ట్ర బిసి సాధికార కన్వీనర్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చలమలశెట్టి అశోక్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు స్థానిక శ్రీరామ్ నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని బిసి నాయకులు, గౌడ సంఘం నేతలు, టిడిపి నాయకులు ఆయనను గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'చంద్రబాబుపై దాడి దారుణం'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుపై దాడి దారుణమని పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై రాయి విసిరి దాడి చేయడం వెనుక వైసిపి ప్రమేయం ఉందని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయంతోనే ఇటువంటి అరాచకాలు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జీలుగుమిల్లిలో చోటు చేసుకుంది. జీలుగుమిల్లి పంచాయతీ రామన్నపాలెం కాలనీకి చెందిన బి.రమేష్ (25) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఉన్న కలుపు మందు నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, స్థానికులు అతడిని హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లింగపాలెం, ఏలూరు అర్బన్

పురుగుల మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం...లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన వల్లిమి రాంబాబు (29) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అత్యవసర చికిత్స నిమిత్తం ధర్మాజీగూడెంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతను పురుగుల మందు తాగడానికి గల కారణాలు ఇంకా తెలియరావాల్సి ఉంది.

బైక్ ఢీకొని బాలునికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న బాలుడిని బైక్ ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక సత్రంపాడుకు చెందిన గెద్దం అజయ్ సత్రంపాడు శివారు ప్రాంతంలో ఉన్న పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు వెళ్లిన అజయ్ సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆ బాలుడిని అక్కడివారు చికిత్సనిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పౌష్టికాహారం.. విద్యార్థులకు దూరం..!

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అమలు కాని మెనూ

ఆవేదనలో విద్యార్థుల తల్లిదండ్రులు


చిమిడిపోయిన అన్నం


చెత్తడబ్బాల్లో అన్నం, కూర

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. దీంతో భోజనం సరిగా చేయక విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. అన్నం చిమిడి పోయి, ముద్దగా ఉండటంతో తినేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సరైన కూరలు కూడా లేకపోవడంతో ఒక్కో సందర్భంలో భోజనం కూడా చేయడం లేదని పలువురు విద్యార్థులు వాపోతారు. ప్రభుత్వం నిర్దేశించిన మెను ఇక్కడ అమలు కావడం లేదు. గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు 2018లో ప్రత్యేక మెనూను ప్రభుత్వం రూపొందించింది. దీని ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ప్రతిపాదించింది. అయితే ఈ మెను ఎక్కడా కూడా అమలు కావడం లేదు. ఈ పాఠశాలలో 135 మంది విద్యార్థులున్నారు. సరైన భోజనం అందించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. భోజనం తినలేక వసతి గృహంలో ఉన్న మురికి కాలువలో పడేసి విద్యార్థులు ఆకలితోనే ఉంటున్నారు. విద్యార్థులు నిద్రించే గదుల కూడా విద్యార్థులే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తరగతి గదులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఉన్నతాధి కా రులు స్పం దించి వి ద్యారు లకు నా ణ్యమైన భో జనం అందించాలని కోరుతున్నారు.

వసతిగృహంలో మెను సక్రమంగా అమలు కావడంలేదు. మెను ప్రకారం ఆదివారం ఉదయం అల్పా హారంగా పూరి, బంగాళాదుంప, బఠాని కూర్మా, స్నాక్స్ వే రుశనగ ఉండ, మధ్యాహ్నం తా లింపు అన్నం, చికెన్ కర్రి, గోంగూర చట్నీ, పెరుగు, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రికి అన్నం, వంకాయకూర, పాలకూర పప్పు, మజ్జిగ పడుకునే ముందు అరటి పండు ఇవ్వాలి. సోమవారం ఉ దయం పాలు, పెసరపప్పు కూ రగాయలతో కిచిడి, పినట్ చట్నీ, మధ్యాహ్నం అన్నం, బంగాళదుంపకూర, సాంబారు, పెరుగు, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రి అన్నం, దోసకాయ కూర, తోటకూర పప్పు, మజ్జిగ, పడుకునే ముందు అరటిపండు, మంగళవారం ఉదయం పాలు, చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు, వేరుశనగ ఉండ, మధ్యాహ్నం అన్నం దొండకాయ ఇగురు, సాంబారు, పెరుగు, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రికి తాలింపు అన్నం, సొరకాయ గోంగూర చట్నీ, మజ్జిగ, పడుకునేముందు అరటిపండు, బుధవారం పాలు, ఇడ్లీ, పినట్ చట్నీ, ఉడికించిన గుడ్డు, వేరుశనగ ఉండ, మధ్యాహ్నం అన్నం, బెండకాయ ఇగురు, సాంబారు, పెరుగు, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రికి అన్నం, బంగాళదుంప కూర, గోంగూర పప్పు, మజ్జిగ, పడుకునే ముందు అరటిపండు, గురువారం పాలు, గోధుమ రవ్వ ఉప్మా, పినట్ చట్నీ, ఉడికించిన గుడ్డు, వేరుశనగ ఉండ, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రికి అన్నం, వెజిటేబుల్, తోటకూర పప్పు, మజ్జిగ, అరటిపండు ఇవ్వాలి. శుక్రవారం పాలు, పెసరపప్పు పొంగల్, పినట్ చట్నీ, ఉడికించిన గుడ్డు, వేరుశనగ ఉండ, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రి భోజనంలో తాలింపు అన్నం, బంగాళదుంప బఠాని, కుర్మా, గోంగూర చట్నీ మజ్జిగ, పడుకునే ముందు అరటిపండు, శనివారం ఉదయం పాలు, ఇడ్లీ, పినట్ చట్నీ, ఉడికించిన గుడ్డు, స్నాక్స్, వేరుశనగ ఉండ, మధ్యాహ్నం అన్నం, క్యాబేజీ ఇగురు, సాంబారు, పెరుగు, సాయంత్రం బెల్లంతో రాగిజావ, రాత్రికి అన్నం, కాయకూర, గోంగూర పప్పు, మజ్జిగ, పడుకునేముందు అరటిపండు ఇవ్వాలి. మెను కోసం మూడు నుంచి నాలుగు తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,400 ప్రభుత్వం కేటాయించింది. అయిదు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,250, ఇంటర్ ఆపైన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1,400 ప్రభుత్వం కేటాయించింది.

నాణ్యమైన భోజనం అందిస్తాం

చాగంటి సోమసుందర్, ప్రధానోపాధ్యాయులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

11న జిల్లా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, సెట్వెల్ ఏలూరు వారి ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ యువజన సర్వీసుల శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యువజనోత్సవాలు సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు సెట్వెల్ సిఇఒ ఎండి.హెచ్.మెహరాజ్ తెలిపారు. ఆసక్తి గల యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జిల్లాల్లో ప్రథమ స్థానంలో నిలిచినవారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) క్యాంపు కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెట్ వెల్ సిఇఒ పోటీలు జరిగే అంశాలను వివరించారు. ఆసక్తి ఉన్న 15 నుంచి 29 సంవత్సరాల వారు వివరాలను step.westgodavari@gmail.comకు ఇ-మెయిల్ ద్వారా ఈ నెల ఎనిమిదో తేదీ లోపు పంపాలన్నారు. వివరాలకు 9949109522 సంప్రదించాలని తెలిపారు.

కాలుష్యరహితంగా కబేలా నిర్వహణ : కమిషనర్


కబేలా సముదాయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ షేక్‌షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు అమలు పరచి మేకల కబేల నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. స్థానిక తొమ్మిదో డివిజన్‌లోని మేకల కబేల సముదాయాన్ని అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 15వ సంఘం ఆర్థిక నిధులతో కబేల అభివృద్ధి ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. మేకల కబేల చుట్టూ ఆక్రమణలు తొలగించి, సరిహద్దులు గుర్తించి రక్షణ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య వాతావరణం కల్పించేలా కబేల సముదాయాన్ని పరిశుభ్రపరచాలని హెల్త్ అధికారికి, అసోసియేషన్ వర్గ సంఘం సభ్యులకు కమిషనర్ షాహిద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ దేవకుమార్‌రావు, హెల్త్ అధికారి గోపాల్ నాయక్, ఎంఇ భాస్కరరావు, డిఇ తాతారావు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, కబేల అసోసియేషన్ వర్గ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్ది ఆదాయం రూ.3.43 లక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూ.3,43,651 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. శనివారం కార్తీక మాస ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయానికి పూజా టిక్కెట్లు, ప్రసాద అమ్మకాలు, అన్నదాన విరాళాల రూపంలో ఈ ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ధర్మకర్తల మండలి సభ్యులు సేవలందించారని తెలిపారు.

7న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ఏలూరు : ఆశా వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా మూడో మహాసభ ఈ నెల ఏడో తేదీన ఏలూరులోని పవర్ పేటలో ఉన్న ఉద్యోగుల రామం భవనంలో నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.జ్యోతి, కె.పోశమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు.

నర్సింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

దెందులూరు : దెందులూరు బిఆర్అండ్‌బి నర్సింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సూరకాంబ, ప్రొఫెసర్ వెంకట్ పాల్గొన్నారు.

దళిత మహిళా రైతులకు శాశ్వత పట్టాలివ్వాలి

ఏలూరు అర్బన్ : దళిత మహిళా రైతులకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని దళిత సేన నేతలు విజ్ఞప్తి చేశారు. ఏలూరులోని దళిత సేన కార్యాలయం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన రాష్ట్ర భూ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బంగారు రవిప్రసాద్ మాట్లాడుతూ లింగపాలెం మండలంలోని దళిత మహిళా రైతులకు శాశ్వత పట్టాలను ఇవ్వాలని కోరారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాలుగా ప్రభుత్వ అసైన్డ్, పోడు భూములు, గ్రామకంఠం భూములు, అటవీ భూముల్లో వ్యవసాయం సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న దళిత మహిళా రైతులకు ప్రభుత్వ యంత్రాంగం రెవెన్యూ వారి గుర్తించి శాశ్వత పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సేన లింగ పాలెం మండల అధ్యక్షులు చంటి, లింగపాలెం మండల ప్రధాన కార్యదర్శి బూల్లా రవికుమార్, లింగపాలెం మండల సలహా అధ్యక్షులు స్టాలిన్, తోటేలక, రాయుడుపాలెం గ్రామ అధ్యక్షులు పెల్లంగి ఐదియా, ఎడవల్లి అనురాధ, దళిత మహిళా రైతులు పాల్గొన్నారు.


బస్సును తోస్తున్న కండక్టర్, ప్రయాణికులు

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతం, సుఖమయం అని అధికారులు చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటున్నాయి. బస్సు ఎక్కిన తర్వాత గమ్యానికి ఏ సమయానికి చేరుకుంటామో ప్రయాణికులకు తెలియని దుస్థితి. ఏలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు జీలుగుమిల్లి సమీపంలో రహదారిపై మరమ్మతులకు గురైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కండక్టర్, డ్రైవర్, ప్రయాణికులు బస్సు తోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్‌టిసి అధికారులు స్పందించి ఫిట్‌నెస్ ఉన్న బస్సులను తిప్పాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

అశోక్‌నగర్‌లో కచ్చా డ్రెయిన్ పనులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అశోక్ నగర్ (చేపలపేట) ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ పనులను ఎంపిపి గంజిమాల రామారావు శనివారం ప్రారంభించారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముందు ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లగా పనులు చేపట్టాలని ఎన్‌ఆర్‌ఇజిఎస్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పనులు చేపట్టారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పలువురు వక్తలు సూచించారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయ హాస్పిటల్స్ డాక్టర్ రితేష్ హార్ట్ కేర్ వారి సాయంతో స్థానిక ఏలూరు బార్ అసోసియేషన్ హాలు వద్ద శనివారం ఉచిత మెగా గుండె, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చింతలపూడి పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ తేజస్వి, గుండె నిపుణులు డాక్టర్ రితేష్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు వస్తే డాక్టర్లను సంప్రదించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మొదటి అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసరావు, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి మంగాకుమారి, తదితర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - భీమడోలు

రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు విధిగా ఇ-క్రాప్, ఇ-కెవైసి నమోదు చేసుకోవాలని సివిల్ సప్లై టెక్నికల్ సహాయకులు కె.శిరీష తెలిపారు. భీమడోలులో శనివారం రైతు భరోసా కేంద్ర వాలంటీర్లకు, సహకార సంఘాల సిబ్బందికి, కస్టోడియన్ అధికారులు వ్యవసాయ రెవెన్యూ సిబ్బందికి ధాన్యం కొనుగోళ్లపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదరు అంశంలో మాస్టర్ ట్రైనీగా శిక్షణ పొందిన సివిల్ సప్లై టెక్నికల్ సహాయకులు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దండి ఎక్కువ ధర అందుబాటులోకి వస్తుందని రైతులు అక్కడ అమ్ముకోవచ్చని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టే ధాన్యం సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆరుదల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారన్నారు. తేమశాతం, నాణ్యత ప్రమాణాలు ఆధారంగా కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు. లేవనెత్తిన పలు అంశాలకు స్పష్టత ఇవ్వలేదని సదస్సుకు హాజరైన పలువురు ఆరోపించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుడివాడ రూరల్ మండలం కల్వపూడి అగ్రహారం గ్రామానికి చెందిన ఆమెరికాలో స్థిరపడిన డాక్టర్ డి.బాబూరావు 1977లో ముదినేపల్లి హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు. గత ఆగష్టు 15న చదువుకున్న పాఠశాలను ఆయన కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.ప్రభుదాస్ ఆయన నను పాఠశాల అభివృద్ధి, పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థుల ప్రోత్సాహకానికి ప్రతి సంవత్సరం నగదు అందించాలని కోరారు. 2021-2022 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులకు బాబూరావు నగదు బహుమతిని అందించారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.30వేలు చొప్పున ఆరుగురికి రూ.1.80 లక్షల నగదును విద్యార్థుల పేరుపై బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్ తెలిపారు. ప్రతి ఏటా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. బాబూరావు అందించిన ఆర్థిక సాయానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గృహ లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

గృహ నిర్మాణ సంస్థ ద్వారా గృహాలు మంజూరై వాటి నిర్మాణాలకు ఆసక్తి కనపరచని లబ్ధిదారులు సదరు విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేస్తే గృహ నిర్మాణ సంస్థ అధికారులు, రెవెన్యూ అధికారుల సిఫార్సు మేరకు వివరాలను జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తామని భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. ఆగడాలలంకలో మంజూరైన 97 ఇళ్ల కాలనీలో నిర్మాణాలు ప్రారంభం కాని నేపథ్యంలో భీమడోలుఎంపిపి కనుమల రామయ్య, ఎంపిడిఒ ఆధ్వర్యంలో బృందం శనివారం సాయంత్రం కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గుండుగొలనులో నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ సతీష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పోలవరం ముంపునకు గురైన వేలేరుపాడు మండలం కొరుటూరు నిర్వాసితులకు రౌతుగూడెం సమీపంలో కాలనీలను కేటాయించిన సంగతి విదితమే. కొంతకాలంగా శ్మశాన వాటికకు అనుకూలమైన స్థలం కేటాయించలేదని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. దీంతో స్పందించిన స్థానిక ఎంపిపి కర్ర పోసమ్మ, స్థానిక ఎంపిటిసి సోమరాజు శ్రీనివాస్ శనివారం నిర్వాసిత కాలనీలో పర్యటించి స్థల పరిశీలన చేశారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్ అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్ నిర్మల న్యాయ సాయం అందించేందుకు జైల్ టీమ్ సభ్యులతో శనివారం సబ్ జైలును సందర్శించి వారి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.దేవదాసు, జైల్ టీమ్ న్యాయవాది మీసాల రమేష్, పారా లీగల్ వాలంటీర్ అక్బర్ అలీ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఆక్వా రైతులు చెరువుల వద్ద తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ ఎఇ రామకృష్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. చెరువుల వద్ద నాణ్యమైన వైర్లను, ఏరియేటర్లను వినియోగించాలన్నారు. విద్యుత్ వైర్లను ఎనిమిది అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యుత్ వినియోగంలో సమస్యలు ఎదురైతే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని తెలిపారు.

కొమ్మరలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాలు ప్రజలు వినియోగించుకోవాలని 104 వైద్యాధికారి బి.సురేష్ అన్నారు. కొమ్మర సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరంలో ఆయన మాట్లాడారు. క్యాంపులో రోగులకు పలు పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు బాలింతలు, వెంకటలక్ష్మి, చిన్నారి, ప్రసన్నలకు ప్రిస్కిప్షన్లు అందజేశారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కృత్రిమ అవయవాలు అందించడం ద్వారా వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని విజయవాడ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ దామెర్ల శ్రీకాంత్ అన్నారు. తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో ఉన్న పోలియో కృత్రిమ అవయవ కేంద్రంలో శనివారం వికలాంగులకు ఆమె కృత్రిమ అవయవాలను అందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ లయన్స్ మార్కెటింగ్ చైర్మన్ శ్రీరామ్ పవన్, నిర్వాహకులు శ్రీనివాసరావు, ప్రభాకరరావు, స్వర్ణ కుమారి, హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, కార్యదర్శి టి.లక్ష్మి పాల్గొన్నారు.